క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయ పునఃప్రతిష్ఠ



విలసవిల్లిలో నూతనంగా ప్రతిష్ఠించిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కారుపర్తి నాగమల్లేశ్వర సిద్ధాంతి ఆధ్వర్యంలో ఆలయ శిఖరం, ధ్వజ స్తంభాలను ప్రతిష్ఠించారు. అనంతరం అన్న సమారాధన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా సత్తెమ్మ జాతర మహోత్సవాలు



నడిపూడిలో నిర్వహిస్తున్న సత్తెమ్మ అమ్మవారి జాతర

అమలాపురం రూరల్: మండలంలోని నడిపూడిలో సత్తెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన సత్తెమ్మ తల్లిని దర్శించుకునేందుకు అమలాపురం, పాలగుమ్మి, జనుపెల్లి, నల్లచెరువు, నల్లిమిల్లి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. 18 తేదీ నుంచి జరుగుతున్న జాతర మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. రంకిరెడ్డి కుటుంబీకులు పంట పొలాల్లో తాడి చెట్టు వద్ద నుంచి అమ్మవారిని తీసుకొచ్చి గ్రామంలో నిలబెట్టి జాగారం చేశారు. జాతరలో సర్పంచ్ చెల్లుబోయిన నాని, ఉప సర్పంచ్ సాంబమూర్తి, రంకిరెడ్డి శ్రీనివాసరావు, రామలింగేశ్వరరావు, ఎంపీటీసీ అరిగెల శ్రీరామారావు, అరిగెల సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

తాళ్లరేవు: చరిత్ర ప్రసిద్ధి గాంచిన చొల్లంగి రాజరాజేశ్వరి సమేత సోమేశ్వరస్వామివారి ఆలయంలో బుధవారం అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ, కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వెలవలపల్లి భవానీశంకర్ శర్మ, చిరంజీవి జీవన్యాసం, దృష్టి కుంభం, దృష్టి గోవు, కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బూరెల వెంకట్రాజు, వరిపల్లి శివాజీ గణేష్, కనకాల చినబాబు తదితరులు పాల్గొన్నారు.


నీటి ఎద్దడి నివారణకు చర్యలు



గోపవరంలో పంట కాలువను బాగు చేయిస్తున్న సర్పంచ్ బుల్లియ్య

ఉప్పలగుప్తం: రానున్న వేసవిలో నీటి ఎద్దడి నివారించడానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ కుంచే బుల్లియ్య అన్నారు. ఏటా తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బుధవారం ఆయన మండలంలోని గోపవరం గ్రామంలో ఉన్న పంట కాలువల్లో పూడికతీత, ఆధునీకరణ పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వేసవిలో ప్రజల అవసరాలకు, పశువుల దాహార్తికి బ్రాహ్మణ చెరువు నీటినే ఉపయోగిస్తారని, ఆ చెరువుకు సజావుగా నీరు చేరేందుకు కాలువలను ఆధునీకరిస్తున్నామని చెప్పారు.

42 మంది రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

అమలాపురం రూరల్: వేసవి నేపథ్యంలో రక్తం కొరత ఏర్పడడంతో బుధవారం అమలాపురంలోని ఎర్ర వంతెన సమీపంలోని బుద్ధాల బ్లడ్ బ్యాంకు వద్ద లైఫ్ ఈజీ బ్యూటీఫుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. శిబిరంలో 42 మంది రక్తదానం చేశారు. రక్తదానమంటే ప్రాణదానంతో సమానమని, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఫౌండేషన్ అధ్యక్షుడు కొలిశెట్టి తాతాజీ అన్నారు. శిబిరంలో వైద్యులు కారెం రవితేజ, రవీంద్ర, శివ ఆశిష్, ఫౌండేషన్ ప్రతినిధులు లక్ష్మీదుర్గ, చీకట్ల కిరణ్, ఆర్కే నాయుడు, వానపల్లి కేశవ, హనుమాన్ బుజ్జి, కుంపట్ల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలోనే అన్ని వర్గాలకు మేలు



జి.వేమవరంలో బుల్లెట్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు తదితరులు



జి.మూలపాలెంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

- ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ, ఎంపీ అభ్యర్థి రాపాక
- ఐ.పోలవరం మండలంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

ఐ.పోలవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం ఐ.పోలవరం మండలంలోని జి.మూలపాలెంలో వారిద్దరూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో పెద్ద ఎత్తున మహిళలు మంగళ హారతులిచ్చి వారికి స్వాగతం పలికారు. వేలాది మంది వైఎస్సార్ సీపీ శ్రేణులు మోటారు సైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. తొలుత జి.మూలపాలెం గోదావరి నది ఒడ్డున ఉన్న అమ్మవారికి పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. జి.మూలపాలెం, భీమ్‌నగర్, ఎర్రగరువు, గోపాలకృష్ణ సెంటర్, జి.వేమవరం గ్రామంలోని చినకొడప, పెదకొడప, రేవువారి పేట, బీసీ పేట, గుత్తినదీవి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జి.వేమవరం గ్రామంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌తో కలిసి అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇద్దరూ మోటారు బైకుపై ఎక్కి గ్రామంలోని ప్రతి కూడలికి వెళ్లి ఓటర్లను ఓటు అభ్యర్థించారు. పలు కూడళ్లలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జగన్‌ను భారీ మెజారిటీతో గెలిపిద్దాం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని భారీ మెజారిటీతో గెలిపించుకుని జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాపాక మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్ప బలంతో అమలాపురం పార్లమెంట్‌లో విజయం సాధించి తీరతానన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఇంటింటికీ లబ్ధి చేకూర్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామన్నారు. ప్రచారంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, కాటం సత్తిరాజు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, మెండా వెంకన్న, దండుప్రోలు కోయిరాజు, మోర్త చిన్నా, ఉందుర్తి ఈశ్వరీబాయి, మందపాటి విజయలక్ష్మి, మందపాటి భైరవస్వామి, నల్లా మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పుట్టుకతో వచ్చే లోపాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య

అమలాపురం టౌన్: చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే మానసిక, శారీరక లోపాలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి డైస్ సెంటరు మానసిక వైద్యురాలు డాక్టర్ పి.సౌమ్య సూచించారు. వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా స్థానిక డైస్ సెంటరులో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ సౌమ్య పాల్గొని మాట్లాడారు. డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం ద్వారా చిన్నారులకు వైద్య సేవలందిస్తామని డాక్టర్ సౌమ్య పేర్కొన్నారు. చిన్నారులకు ముఖ్యంగా పుట్టుకతో వచ్చే లోపాలు, రుగ్మతల లక్షణాలు, నివారణ మార్గాలను ఆమె వివరించారు. పుట్టుకతో లోపాలున్న పలువురు పిల్లల తల్లిదండ్రులు సదస్సుకు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, ఆర్‌ఎంఓ డాక్టర్ అనూష, డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ సోషల్ వర్కర్ సీహెచ్ బాబి, ఎన్‌టీసీపీ సోషల్ వర్కర్ కె.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

క్యాంపెయినింగ్ కమిటీ ఏర్పాటు

యానాం: పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి వచ్చే నెల 19న ఎన్నిక జరగనున్న నేపథ్యంలో బుధవారం క్యాంపెయినింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ పీసీసీ అధ్యక్షుడు వైథిలింగం ఆదేశాలు జారీ చేశారు. మాజీ మంత్రి కందసామి చైర్మన్‌గా మాజీ మంత్రులు షాజహాన్, కమలకన్నన్, రమేష్ పరంబత్, మాజీ డిప్యూటీ స్పీకర్ బాలన్ తదితరులతో కూడిన 19 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఏఐసీసీ పుదుచ్చేరి ఇన్‌చార్జి అజయ్‌కుమార్ కమిటీకి ఆమోదం తెలిపారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ముమ్మిడివరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి యోగితా లక్ష్మి సూచించారు. బుధవారం ముమ్మిడివరం నగర పంచాయతీ 8, 9 వార్డుల ప్రజల కోసం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. వైద్యులు సుమారు 307 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డా.కెజియా, టి.నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఓటూ విలువైనదే



ఓటు విలువపై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో కేశవ వర్ధన్‌రెడ్డి

అమలాపురం రూరల్: ఎన్నికల్లో ప్రతి ఓటు విలువైనదేనని ప్రతిఒక్కరూ గుర్తించాలని ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి జి.కేశవ వర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు క్రమబద్ధమైన ఓటర్ల విద్య-ఎన్నికల భాగస్వామ్యం(స్వీప్)పై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కేశవ వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు నమోదు చేసుకుని ప్రజాస్వామ్య విలువలు కాపాడాలన్నారు. అనంతరం ఓటు ఆవశ్యకతపై నినాదాలతో రూపొందించిన పతంగుల పండగలో పాల్గొని పతంగులను ఎగురవేశారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. మొదటిసారి ఓటర్లు, థర్డ్ జెండర్, సర్వీస్ ఓటర్లు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. ప్రతి ఓటు క్రియాశీల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్వ శిక్షా అభియాన్ ఏపీడీ మధుసూదన్, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ పి.రాంబాబు, ఏపీవో ఎంఏకే భీమారావు, ఎంఈఓ దుర్గాదేవి, రవణం వేణుగోపాల్, సీఆర్‌పీలు జి.నాగన్న, మెండి శ్రీనుబాబు, అనూష పాల్గొన్నారు.

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి

అంబాజీపేట: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తున్నందున పన్ను వసూళ్లను నూరు శాతం పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఎల్పీఓ పి.బొజ్జిరాజు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందితో ఇంటి పన్నుల వసూళ్లపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్పీఓ బొజ్జిరాజు మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటికి ఇంటి పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పన్ను వసూళ్లలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి, నూరు శాతం వసూలు జరిగేలా చూడాలన్నారు. ప్రజలు కూడా ఇంటి పన్నులు చెల్లించి సహకరించాలన్నారు. చట్ట ప్రకారం వ్యాపార సముదాయాలు, ఇతర అంశాలపై రాజకీయ నాయకుల ప్రచార బోర్డులు తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ బి.మమత, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యకు చెక్

- చానళ్లలో తూడు, వ్యర్థాల తొలగింపు
- డ్రెయిన్లలో క్రాస్‌బండ్ల ఏర్పాటు



బిళ్లకుర్రు వద్ద జేసీబీతో ఓల్డ్ వాడపాలెం చానల్‌లో చేపట్టిన పూడికతీత, చెత్త తొలగింపు పనులు

కొత్తపేట: ప్రస్తుత రబీ (దాళ్వా) పంటను సాగునీటి సమస్య నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంది. దాంతో చానళ్ల శివారు భూములకు పూర్తి స్థాయిలో సాగునీరు అందుతుంది. ఓ వైపు గోదావరిలో వాటర్ లెవెల్ అంతంత మాత్రంగా ఉన్నా సక్రమంగా సరఫరా చేయడం, మరోవైపు దాళ్వా పంట నష్టపోకుండా గట్టెక్కించాల్సిన పరిస్థితి. ఇటీవల ఈ విషయాన్ని స్థానిక రైతులు, రైతు నాయకులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరావుతో సమీక్షించారు. ఆ మేరకు సీఈ క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించి, సాగునీటికి రైతులు పడుతున్న ఇబ్బందులను, చానళ్లలో సాగునీటి సరఫరాకు అడ్డంకిగా ఉన్న తూడు, వ్యర్థాల తొలగింపు, డ్రెయిన్లలో నీరు కూడా సద్వినియోగం చేసుకునేలా క్రాస్‌బండ్ల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వివరించారు. దానిపై కలెక్టర్ శుక్లా స్పందించి సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఏ మండలంలో చానళ్లలో సమస్య ఉందో.. ఆయా మండలాలకు రూ.లక్ష వరకు ప్రత్యేక నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. ఇరిగేషన్, డ్రెయిన్ల శాఖల అధికారులు ఆయా పనులు చేపట్టి బిల్లులు తహసీల్దార్లకు సమర్పిస్తే, నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ఆ మేరకు జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల్లో పనులు చేపట్టారు. దానిలో భాగంగా బొబ్బర్లంక-ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువపై వాడపాలెం లాకుపైన, మండలంలోని వాడపాలెం ఓల్డ్ చానల్‌లో రూ.30 వేలతో తూడు, వ్యర్థాల తొలగింపు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. అలాగే బొబ్బర్లంక-అమలాపురం ప్రధాన పంటకాలువపై పలివెల లాకుపైన అంబాజీపేట చానల్ ద్వారా సాగవుతున్న వరి చేలకు అవిడి-గంటిపెద పూడి డ్రెయిన్ నీటి సరఫరాకు రూ.65 వేలతో క్రాస్ బండ్ ఏర్పాటు చేశారు. వంతుల వారీ విధానంలో అన్ని ప్రాంతాల వరి ఆయకట్టుకు సాగునీరు సమంగా సరఫరా చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి తగినంత నీటి మట్టం కడుతున్నారు.



అవిడి డ్రెయిన్‌పై ఏర్పాటు చేసిన క్రాస్‌బండ్

దాళ్వా పంటకు అవసరమైన సాగునీటి సరఫరా



ప్రస్తుత దాళ్వా వరి పంటకు అవసరమైన సాగునీరు సరఫరాకు చర్యలు తీసుకున్నాం. ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరావు ఇటీవల స్వయంగా పరిశీలించిన మీదట, కలెక్టర్ ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో, తూడు, వ్యర్థాల తొలగింపుతో చానల్ శివారు భూములకు సాగునీరు సరఫరా చేస్తున్నాం. అలాగే క్రాస్‌బండ్లతో డ్రెయిన్లలో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. వంతుల వారీ విధానంలో వాడపాలెం లాకు పైన కొత్తపేట, వాడపాలెం, బిళ్లకుర్రు భూములకు నీరు సరఫరా చేస్తున్నాం. ఆయా ప్రాంతాల రైతులు సాగు నీటిని సద్వినియోగం చేసుకోవాలి.

– వి.నవీన్‌కుమార్, ఏఈ, కొత్తపేట ఇరిగేషన్ సెక్షన్

ఎంపీ అనురాధను కలిసిన రాపాక



రాపాక వరప్రసాదరావును సత్కరిస్తున్న ఎంపీ చింతా అనురాధ



ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను సత్కరిస్తున్న రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

అల్లవరం: అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నియమితులైన రాపాక వరప్రసాదరావు బుధవారం మొగళ్లమూరులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ చింతా అనురాధను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాపాక వరప్రసాదరావును ఎంపీ అనురాధ సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా గోడిలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను సూర్యారావు దుశ్శాలువాతో సత్కరించారు. వారి వెంట జిల్లా వైఎస్సార్ సీపీ రైతు విభాగం కార్యదర్శి చేట్ల సత్యనారాయణ, నామవరపు హనుమంతరావు ఉన్నారు.

మత్స్యకార గ్రామాల్లో పోలీసుల కవాతు



గాడిమొగలో కేంద్ర బలగాలతో కలిసి కవాతు చేస్తున్న కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్, కోరంగి ఎస్ఐ రవికుమార్

తాళ్లరేవు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో ధైర్యం నింపేందుకు పోలీసులు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి మత్స్యకార గ్రామాల్లో బుధవారం కవాతు నిర్వహించారు. కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి డా.కె.హనుమంతరావు ఆదేశాలతో కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాడిమొగ, పెదవలసల గ్రామాల్లో కవాతు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు కేంద్ర, పోలీస్ బలగాలు భద్రత, భరోసా కల్పిస్తాయని తెలియజేసేందుకే ఈ కవాతు నిర్వహించామన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలి

యానాం: ప్రతిఒక్కరూ విద్యార్థి దశలోనే రాజ్యాంగంలో పేర్కొన్న మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సరెళ్ల వీరకుమార్ పేర్కొన్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా రీజెన్సీ కళాశాలలో జరిగిన హ్యూమన్ రైట్స్ అండ్ ఉమెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మానవ హక్కులతో పాటు మహిళలకు కల్పించిన రక్షణ హక్కుల గురించి సైతం తెలుసుకోవాలన్నారు. అంతకు ముందు పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మార్తాండ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కీర్తి పురస్కారం అందుకున్న దాట్ల



తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారాన్ని అందుకున్న దాట్ల

యానాం: పట్టణానికి చెందిన ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానంరాజు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు సృజనాత్మక సాహిత్యంలో చేసిన విశేష కృషికి గాను ఆయనకు వైస్ చాన్సలర్ ఆచార్య టి.కిషన్‌రావు, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, రిజిస్ట్రార్ భట్టు రమేష్ తదితరులు కీర్తి పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి శిఖామణి, డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, బొల్లోజుబాబా, ముమ్మిడి చిన్నారి తదితరులు దాట్లకు అభినందనలు తెలిపారు.

వరిలో అధిక దిగుబడి సాధించాలి



ఆలమూరులో ఆర్బీకేను సందర్శించిన బోసుబాబు

ఆలమూరు: సాగుబడిలో వరి రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు పలు సూచనలు అందజేశారు. పంట కోత కోసే దశకు వచ్చినందున ప్రస్తుతం రైతులు అవలంబిస్తున్న విధానాలపై ఆరా తీశారు. వేసవిలో నీటి ఎద్దడి కారణంగా వచ్చే సమస్యలపై ఆందోళన చెందవద్దన్నారు. వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖ సమన్వయంతో రైతుల సమస్యలను పరిష్కరిస్తాయన్నారు. రబీ సాగులో ససరక్షణ చర్యలు పాటించడం ద్వారా చీడపీడలు నివారించవచ్చన్నారు. ఈ సీజన్‌లో ఎకరాకు సుమారు 50–55 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వ్యవసాయ శాఖ తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సిబ్బంది పాటించాల్సిన నియమాలను వివరించారు. ఏడీఏ కె.నాగేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి సోమిరెడ్డి లక్ష్మీలావణ్య, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపన



ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్తులు

ఆలమూరు: మడికి శివారు చిలకలపాడులో నూతనంగా నిర్మించిన రామాలయంలో బుధవారం సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేవతామూర్తుల విగ్రహాలను దర్శించుకుని, వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఘనంగా సత్కరించారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన జరిగింది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ యు.లక్ష్మీమౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే

రావులపాలెం: పొడగట్లపల్లి గ్రామంలో చిన రామాలయం వీధిలో నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి గ్రామస్తులు బుధవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిక్కిరిసిన సిద్ధి వినాయక ఆలయం

అయినవిల్లి: ఏకాదశి పర్వదినం సందర్భంగా స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయం బుధవారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారి దర్శనం కోసం ఉదయం నుంచి భక్తులు క్యూలైన్‌లో నిలబడ్డారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో శ్రీలక్ష్మీగణపతి హోమం జరిపారు. అలాగే నల్లచెరువు వేంకటేశ్వర స్వామివారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.



స్వామివారి సన్నిధిలో భక్తుల సందడి

చిన్నారులకు అన్న ప్రాసనలు



సీమంతాలు, అన్నప్రాసనలు నిర్వహిస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: రాజోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మోరి సెక్టార్ ఉయ్యూరువారి మెరక అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా అన్నప్రాసనలు, సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సూపర్‌వైజర్ చంద్రకళ, మహిళా పోలీసు సూజన్, ఏఎన్ఎం మీనాకుమారి, స్కూల్ హెచ్ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.